క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

బల్లికురవ: ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి ఈనెల 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ 2 కె. రమేష్‌బాబు శనివారం తెలిపారు. సీటు సాధిస్తే 6 సంవత్సరాల పాటు ఉచిత విద్య పొందవచ్చన్నారు. 10వ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీటు కేటాయించాలని జూన్ 5వ తేదీన ఎంపికైన విద్యార్థుల జాబితా ప్రకటిస్తారని 11న సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు. 560 మార్కులు పైన వచ్చిన విద్యార్థులంతా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం

చీరాల అర్బన్: చీరాల ఆర్టీసీ డిపో పరిధిలోని చీరాల, పర్చూరు, ఇంకొల్లు, వేటపాలెం బస్‌స్టేషన్లలో ఓపెన్ ప్రదేశాల్లో 15 సంవత్సరాలకు లీజుకు ఇచ్చే పద్ధతిలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిపో మేనేజర్ జంజనం శ్యామల శనివారం తెలిపారు. ఈనెల 28వ తేదీ వరకు అప్లికేషన్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, దరఖాస్తుదారులు 29వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల్లోపు నెల్లూరులోని ఈడీ కార్యాలయంలోని టెండర్ బాక్సులో వేయాలన్నారు. టెండర్లపై ఈనెల 24న చీరాల బస్టాండ్‌లోని కార్యాలయంలో ముందస్తు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం



అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి నగదు సాయం అందిస్తున్న రోటరీ సభ్యులు

పర్చూరు (చినగంజాం): మండలంలోని నూతలపాడులో నిర్వహిస్తున్న రోటరీ గంగ వాటర్ ప్లాంట్‌లో విధులు నిర్వహించే అద్దంకి శ్రీనివాసరావుకు సపోర్ట్ సాయంతో రోటరీ క్లబ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో రూ. 25 వేలు నగదు సాయం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న అతనికి వైద్య ఖర్చుల నిమిత్తం శనివారం నగదు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ చేతుల మీదుగా అందజేశారు. నిత్యావసరాలు అందజేసి శ్రీనివాసరావు త్వరగా కోలుకొని ఆరోగ్యవంతుడు కావాలని రోటరీ క్లబ్ సభ్యులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సపోర్ట్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు, కార్యదర్శి పంబి సదానంద రెడ్డి, సభ్యులు భవనం రాజగోపాల రెడ్డి, పాబోలు వెంకటేశ్వర్లు, పోలిశెట్టి చంద్రశేఖర్ రావు, కారుమూడి సుబ్బారెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

భక్తుల ఇలవేల్పు స్వర్ణమ్మ

- రేపటి నుంచి తిరునాళ్లు
- చారిత్రక ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వర్ణమ్మ తల్లి



తిరునాళ్ళకు ముస్తాబవుతున్న స్వర్ణమ్మ తల్లి దేవాలయం

కారంచేడు: గ్రామ దేవత స్వర్ణమ్మ తల్లి తిరునాళ్లను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాన్ని వరదలు ముంచెత్తే సమయంలో తన చీర కొంగును అడ్డుపెట్టి గ్రామాన్ని కాపాడింది స్వర్ణమ్మ తల్లి అని భక్తుల విశ్వాసం. కాగా 32వ తిరునాళ్ల సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వరుసగా మూడు రోజులు నిర్వహించడం ప్రతి ఏడాది ఆనవాయితీగా వస్తోంది. మొదటి రోజు సోమవారం అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పిస్తారు. ప్రతి ఇంటి నుంచి గ్రామ ఆడపడుచుకు పసుపు కుంకుమలు తీసుకురావడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. ఆడపడుచులు ఎక్కడ ఉన్నా సంవత్సరానికి ఒకసారి అయినా ఈ పండుగకు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, సిడిమాను ఉత్సవం, అమ్మవారి ఘటం కుండలు, హరిశ్చంద్ర నాటకం, విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేస్తారు. బుధవారం అమ్మవారికి నివేదన (పొంగళ్ళు) సమర్పణతో తిరునాళ్లను ముగిస్తామని దేవాదాయ, ధర్మాదాయ శాఖ మేనేజర్ వెయ్యాల చినకృపారావు తెలిపారు. గ్రామంలో ఎలాంటి శుభకార్యం జరిపినా అమ్మవారికి మొదటి శుభలేఖను అందిస్తారు. గ్రామంలో ఎలాంటి నూతన వాహనాలు కొనుగోలు చేసినా వాహనంపై స్వర్ణమ్మ తల్లి పేరునే వేయించుకోవడం ఇక్కడ ప్రజలకు భక్తి. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి స్వర్ణమ్మ తల్లి తిరునాళ్లకు అవసరమైన ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వెయ్యేళ్లకు పైగా..

అమ్మవారు ..గ్రామాన్ని, గ్రామ ప్రజలను కంటికి రెప్పలా కాపాడారని సుమారు వెయ్యి సంవత్సరాలకు పైగా చరిత్ర ఉందని చెబెతారు. ఒక రోజు అర్ధరాత్రి అంతా నిద్రపోతున్న సమయంలో చీరాల వైపు నుంచి వరద స్వర్ణ గ్రామం వైపు ఉరకెత్తడం మొదలైంది. నిద్రలో ఉన్న గ్రామంపైకి వస్తున్న వరదను స్వర్ణమ్మ తల్లి తన చీర కొంగును అడ్డుపెట్టి వరదకు అడ్డుకట్ట వేశారట. తెల్లవారిన తరువాత గ్రామస్తులు లేచి చూసినప్పుడు వరదలు వచ్చిన ఆనవాళ్ళు కనిపించాయి. తమను, తమ గ్రామాన్ని వరదబారి నుంచి రక్షించి, తమ ప్రాణాలు కాపాడిన స్వర్ణమ్మను గ్రామ దేవతగా పూజించడం మొదలు పెట్టారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారికి ప్రతి ఏటా తిరునాళ్ళు నిర్వహించి భక్తులు తమ మొక్కుబడులు తీర్చుకుంటారు. గ్రామానికి చెందిన ప్రజలు ఎక్కడ ఏ పనుల్లో ఉన్నా తిరునాళ్ళకు తప్పకుండా గ్రామానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటుంటారు. గ్రామ ఆడపడుచులు ఎక్కడ నివాసాలున్నా తిరునాళ్ళకు గ్రామానికి చేరుకుంటారు. తిరునాళ్ళకు అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

ఎన్‌సీసీతో ఉజ్వల భవిత



క్యాడెట్లతో ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్, అధికారులు

చీరాల టౌన్: ఎన్‌సీసీలో విద్యార్థులు చేరడం వలన భవిష్యత్తు ఉజ్వలంగా ఉండటంతో పాటు త్రివిధ దళాల్లో సులభంగా ఉద్యోగ అవకాశాలు పొందుతారని 23వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.ఎస్.పరమార్ అన్నారు. శనివారం చీరాల్లోని ఎన్‌సీసీ కార్యాలయంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఎన్‌సీసీ సి–సర్టిఫికెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. తెలంగాణ, ఏపీ తెంగాణ డైరెక్టరేట్ పరిధిలో నిర్వహించిన సి – సర్టిఫికెట్ పరీక్షల్లో చీరాల 23 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రతిభ చూపారు. వీరికి కమాండింగ్ ఆఫీసర్ పరమార్ సర్టిఫికెట్లు అందించి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్‌సీసీలో విద్యార్థులు చేరడం వలన శారీరక ధృఢత్వం, నాయకత్వ లక్షణాలు, ఏకాగ్రత, సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు దేశ సేవ చేసేందుకు త్రివిధ దళాల్లో సులభంగా ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ సుబేదార్ మేజర్ నజీర్, సుబేదార్ సబూర్‌సింగ్, ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్ బాబు, ఎన్‌సీసీ క్యాడెట్లు, సిబ్బంది ఉన్నారు.

సాగు హక్కుకే కౌలు కార్డులు



దగ్గుబాడులో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందిస్తున్న ఆర్ఐ, ఏఓలు

దగ్గుబాడు(కారంచేడు): కౌలు రైతులు తమ భూయజమానుల సహకారంతో తీసుకొనే కౌలు కార్డుల వలన భూ యజమానులకు ఎలాంటి నష్టం ఉండదని వ్యవసాయాధికారి కె. సుధీర్‌బాబు అన్నారు. శనివారం దగ్గుబాడు పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన కౌలు రైతుల అవగాహన సదస్సులో మాట్లాడారు. కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి అందించే కార్డుల వలన వారికి భూమిపై సాగు హక్కు మాత్రమే ఉంటుందన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పంట నష్ట పరిహారం, ప్రభుత్వ రాయితీలు అందుకోవడానికి వీలుంటుందన్నారు. ఆర్ఐ ఎం. జగదీష్, వీఆర్ఓ లక్ష్మి, వ్యవసాయ సహాయకుడు కిషోర్, కౌలు రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం



విద్యార్థులచే నీతి కథలు చదివిస్తున్న గ్రంథపాలకురాలు



అద్దంకి: పట్టా అందుకుంటున్న సుగుణరావు, రికార్డు అసిస్టెంట్ వసుంధరా దేవి

చీరాల అర్బన్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గ్రంథపాలకురాలు డి.ధనమ్మ శనివారం అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను పరిశీలించారు. గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. వేసవి సెలవుల్లో సమయం వృథా చేయకుండా చిన్నారులు ప్రతిరోజు గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదివితే విజ్ఞానాన్ని సముపార్జించుకోవచ్చన్నారు. నీతికథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు వారిచే చదివించి మరలా చెప్పించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణా తరగతులకు విద్యార్థులను తల్లిదండ్రులు పంపించాలన్నారు.

అద్దంకి రూరల్: అద్దంకిలోని గ్రంథాలయం సొంత భవనం ఏర్పాటు చేసుకోవాటానికి తహసీల్దార్ శ్రీచరణ్ స్థానిక ఎస్‌ఎస్పీ కార్యాలయం ఆవరణలో ఉన్న 10 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా రిజిస్ట్రేషన్ పత్రాలను రిటైర్డు లైబ్రేరియన్ సుగుణరావు, ప్రస్తుత రికార్డు అసిస్టెంట్ వసుంధర దేవి అందుకున్నారు.

పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

చీరాల టౌన్: ఎండలు అధికంగా కాస్తున్నందున పశుపోషకులు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాడి పరిశ్రమతో ఆర్థిక వృద్ధి సాధించాలని పశువైద్యులు పావని సూచించారు. శనివారం బోయినవారిపాలెంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 53 గేదెలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పశువులు ఆరోగ్యంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పాల ఉత్పత్తి పెరిగేలా పోషక విలువలు కలిగిన దాణాలను పశువులకు అందించాలని సూచించారు.

దివ్యాంగులకు వీల్ చైర్ల అందజేత



చీరాల: చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ళ లైమ్ సిటీ, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నలుగురు దివ్యాంగులకు వీల్‌చైర్స్‌ను అందించారు. రోటరీ సామాజిక భవనంలో 15 ఏళ్ల లోపు విద్యార్థులు.. నడుము కింది భాగం నుంచి నరాల బలహీనత ఉంచి కూర్చోలేని, నిలబడలేని నలుగురికి వీల్‌చైర్లను అందించారు. సభ్యులు సీహెచ్ బాలవెంకటేశ్వరరావు, నక్కల సురేష్‌బాబు, పోలుదాసు రామకృష్ణ, మామిడాల శ్రీనివాసరావు, వలివేటి మురళీకృష్ణ, జీవై ప్రసాద్, బి.హేమంత్‌కుమార్, జాగర్లమూడి సురేష్, డాక్టర్ ఐ.బాబూరావు, టిఎల్ ప్రతాప్, డి.హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కంభాభిషేక వేడుకలు



శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్‌కు అభిషేకం, ఆకుపూజలు

అద్దంకిరూరల్: ఈనెల 14 నుంచి ప్రారంభమైన కుంభాభిషేక వేడుకల్లో భాగంగా శనివారం యాగశాలలో రుత్వికులు యాగాలు నిర్వహించారు. అనంతరం నూతన రాతి మండలంలోని యంత్రస్థాపన నిర్వహించారు. గర్భాలయంలోని మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకం, లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన సహాయ కమిషనర్ ఎం. తిమ్మనాయుడు, భక్తులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం



పర్చూరు(చినగంజాం): పర్చూరు సచివాలయం- 2లో నూతన ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు రెవెన్యూ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. నూతన ఆధార్ కార్డుకు దరఖాస్తులు, కార్డులోని పేర్లు మార్పులు, చేర్పులు చేయనున్నట్లు తెలిపారు. సెలవు దినాల్లో తప్ప అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 5 గంటలు వరకు పనిచేస్తుందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజేతలకు బహుమతులు అందజేత



విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దాత పోతురాజు తదితరులు

చినగంజాం: శాఖ గ్రంథాలయం చినగంజాంలో శనివారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన కంప్యూటర్ పెయింటింగ్, స్పోకెన్ ఇంగ్లిషు, పెయింటింగ్ వంటి పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు రాజు బంగారుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఇంగ్లిషు ఉపాధ్యాయుడు ఆర్ఎస్‌వీ పోతురాజు విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఆర్థిక వనరులు సమకూర్చి స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరికీ జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్. నరసింహారావు పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు అళహరి మోహన లక్ష్మీనరసింహాచార్యులు, ఆర్పీవై రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భారత్ విజయ యాత్ర

- ఘనంగా 'ఆపరేషన్ సింధూర్' విజయోత్సవ ర్యాలీ
- గ్రామాల్లో అధికారులు, పాలకుల తిరంగ యాత్ర



స్వర్ణలో ఆపరేషన్ సింధూర్ తిరంగ యాత్రలో తహసీల్దార్, అధికారులు



మేదరమెట్లలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



కారంచేడులో ప్రతిజ్ఞ చేయిస్తున్న బాపట్ల జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ శ్యాంసన్



పర్చూరు సింధూర్ ర్యాలీ చేపట్టిన రెవెన్యూ అధికారులు



పర్చూరు బొమ్మల సెంటర్‌లో నినాదాలు చేస్తున్న ప్రజలు

కారంచేడు: పాకిస్థాన్‌పై భారత్ పూర్తి చేసిన ఆపరేషన్ సింధూర్‌కు గుర్తుగా శనివారం వాడవాడలా ర్యాలీలు జరిగాయి. పాలకులు, అధికారులు ఉత్సాహంగా విజయ యాత్ర జరుపుకున్నారు. కారంచేడుతో పాటు, మేజర్ గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీ జరిగింది. దేశ భద్రతకు మన సైన్యం వీరోచితంగా ఏవిధంగా పోరాడి ఉగ్రమూకలను మట్టుబెట్టారో ప్రజలకు వివరించారు. మండల కేంద్రమైన కారంచేడులో బాపట్ల జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ సీహెచ్ శ్యాంసన్, ఎంపీడీఓ కె. నేతాజీ నేతృత్వంలో గ్రామ సర్పంచ్ బాలిక శివపార్వతి, సంబంధిత అధికారులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మండలంలోని స్వర్ణ గ్రామంలో గ్రామ సర్పంచ్ మోటాని మధుసూదనరావు ఆధ్వర్యంలో తహసీల్దారు జి.రాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హస్నప్రియ, పంచాయతీ, వైద్య సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రను విజయవంతం చేయాలి

గ్రామాల్లో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి సీహెచ్ శ్యాంసన్ అధికారులకు సూచించారు. గ్రామాల్లో పచ్చదనం ఉట్టిపడేలా ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటుకోవాలన్నారు. అప్పుడే ప్రజలకు అందాల్సిన మంచి ఆక్సిజన్ అందుతుందన్నారు. ఎంపీడీఓ నేతాజీ, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల టౌన్: ఆపరేషన్ సింధూర్ ద్వారా పాకిస్థాన్‌పై ప్రతీకార చర్యలు చూపించి దేశ పౌరులను కాపాడిన త్రివిధ దళాల సైనికుల సేవలు అజరామరమని చీరాల ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర నాయుడు కొనియాడారు. ఆపరేషన్ సింధూర్‌లో విజయం సాధించడంపై శనివారం మండలంలోని ఈపురుపాలెంలో విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామస్తులు, మండల అధికారులతో కలిసి జాతీయ జెండాలను చేతబట్టుకుని గ్రామంలో విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. పహల్గామ్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి, ఆపరేషన్ సింధూర్‌లో అమరులైన జవాన్లకు నివాళులర్పించి వారి సేవలను కొనియాడారు. గ్రామంలో మానవహారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు మాట్లాడుతూ పహల్గామ్‌లో పర్యాటకులను కాల్చి చంపి పాకిస్తాన్ ఉగ్రవాద చర్యలకు పాల్పడిందని, విపత్కర సమయంలో భారత్‌లోని త్రివిధ దళాలు ఆపరేషన్ సింధూర్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదులను మట్టుబెట్టారన్నారు. సైనికుల వీరోచిత పోరాటాలు, కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో ఉగ్రవాదులను పిట్టల్లా కాల్చిపడేశారని తెలిపారు. యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు యావత్ భారతదేశం అండగా ఉంటుందన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులను అయినా భారత దేశం ఎదుర్కొనే సత్తా ఉందని దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న కేంద్రానికి, సైనికులకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.గోపికృష్ణ, ఎంపీడీఓ శివసుబ్రమణ్యం, ఈవోఆర్డీ రామకృష్ణ, పంచాయతీ సెక్రటరీ మురళీ బాపూజీ, సచివాలయ ఉద్యోగులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరు (అద్దంకి): పాకిస్థాన్ ముష్కరులపై భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీని శనివారం స్వర్ణాంధ్ర, స్వాచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించారు. సంతమాగులూరు మండల కేంద్రం నుంచి ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ రవిబాబు, ఎంపీడీఓ, ఈవోపీఆర్ఆర్డీ, మండల అధికారులు పాల్గొన్నారు.

యద్దనపూడి: దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను త్యజించిన అమరజవానుల త్యాగం మరువలేనిదని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రమైన యద్దనపూడిలో ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో తహసీల్దారు రవికుమార్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, వైద్యాధికారి శ్రీహర్ష , ఆయా శాఖల అధికారులు పెద్ద ఎత్తున పాల్గొని తహసీల్దారు కార్యాలయం నుంచి గొట్టిపాటి నరసయ్య చౌక్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నివీర్ మురళినాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత రక్షణ దళాలు ఆపరేషన్ సింధూర్ ప్రారంభించి విజయం సాధించాయని.. అందుకు స్ఫూర్తిగా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ప్రత్యేకాధికారి ప్రభాకర్ రావు తెలిపారు.

స్వచ్ఛతతో ఆరోగ్యం

మేదరమెట్ల: ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించడం వలన గ్రామం శుభ్రతతో ఉంటుందని మండల ప్రత్యేకాధికారి రాధామాధవి అన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల బస్టాండ్ వద్ద శనివారం ఏర్పాటు చేసిన స్వచ్ఛంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిశుభ్రతను పాటించడం వలన ఆరోగ్యం వస్తుందని పేర్కొన్నారు. ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, సీడీపీవో కృష్ణకుమారి, ఏపీఎం మాణిక్యారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కాలేషా, ఉపసర్పంచ్ దుర్గారావు, ఈవో లక్ష్మీకాంత్ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ: జాతీయ పతాకానికి గౌరవంతోపాటు ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొని దేశాన్ని రక్షించటంలో వీరమరణం పొందిన మురళీనాయక్ సేవలు చిరస్మరణీయమని ఎంపీడీఓ కుసుమ కుమారి అన్నారు. శనివారం దేశరక్షణలో ప్రజల భాగస్వామ్యంపై తిరంగా ర్యాలీ నిర్వహించారు. వీరజవాన్ మురళీ నాయక్ అకాల మరణానికి శ్రద్ధాంజలి ఘటించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. డిప్యూటీ ఎంపీడీఓ దాసరి సుమతి, తహసీల్దార్ రవినాయక్, సెక్రటరీలు వీఆర్‌వోలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు(చినగంజాం): పర్చూరులో తిరంగా జెండా రెపరెపలాడింది. ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీకి భారీగా ప్రజలు, అధికారులు తరలి వచ్చారు. భారత్ మాతాకీ జై అంటూ వారు చేసిన నినాదాలతో పర్చూరు బొమ్మల సెంటర్ మార్మోగింది. ఎండను సైతం లెక్క చేయకుండా ర్యాలీలో మహిళలు, వృద్ధులు కూడా పాల్గొనడం విశేషం. ర్యాలీని ఉద్దేశించి పలువురు వక్తలు ప్రసంగాలు చేశారు. గతంలో పాకిస్తాన్‌పై భారత దేశం సాధించిన విజయాలు గురించి తమ ప్రసంగాల్లో కొనియాడారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేశారు. ఆపరేషన్ సింధూర్‌లో ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్లకు సెల్యూట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్, ఈఓ సత్యనారాయణ, ఏపీఎం రామకృష్ణ, వి. అబ్రహం, మామిడిపాక హరిప్రసాద్, ఎలక్షన్ డీటీ మాధవీ లత, రీసర్వే డీటీ అరుణ, మండల సర్వేయర్ బాలాంజనేయులు పాల్గొన్నారు.



సంతమాగులూరు: మానవహారంగా ఏర్పాటైన అధికారులు



యద్దనపూడి: దేశ సంరక్షణకు పాటుపడదాం అంటూ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



బల్లికురవలో వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్



ఈపురుపాలెంలో తిరంగా విజయోత్సవ ర్యాలీ చేస్తున్న ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు, అధికారులు

రాతి ముఖ మండప నిర్మాణానికి విరాళాల వెల్లువ



విరాళం అందిస్తున్న దాతలు

అద్దంకి: శ్రీప్రసన్నాంజనేయ స్వామి రాతి ముఖ మండప నిర్మాణానికి విరాళాలు వెల్లువ కొనసాగుతోంది. శనివారం కామేపల్లి లక్ష్మీ ప్రసాద్ ధర్మపత్ని సామ్రాజ్యం రూ.2,01,116, అద్దంకి మండలం నాగులపాడు గ్రామానికి చెందిన అడుసుమల్లి వెంకటేశ్వర్లు ధర్మపత్ని అరుణ రూ.1,00,359, అద్దంకి పట్టణానికి చెందిన చిన్ని అంజిబాబు ధర్మపత్ని శ్రీదేవి రూ.1,01,116, మండలంలోని తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన శ్వాశ్వతా గ్రాఫిక్స్ అధినేత అల్లంనేని పూర్ణచంద్రరావు రూ.1,05,116 విరాళంగా అందజేసినట్లు ఏసీ తిమ్మనాయుడు తెలిపారు.

ఏసీ వితరణ

శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి మారుతీ సత్రంలోని ఒక గదికి అవసరమైన ఏసీ, మంచం, ఏసీ, గీజర్‌ను, కొరిశపాడు మండలం రావినూతలకు చెందిన పుట్టా భాస్కరరావు ధర్మపత్ని లక్ష్మీ కుమారుడు నాగచందు, కుమార్తె జాహ్నవి, శనివారం అంజేశారు. వాటికి అవసరమైన నగదును ఏసీ తిమ్మనాయుడికి శనివారం అందజేశారు.

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి నూతన రాతి ముఖమండప ఏర్పాటుకు అద్దంకికి చెందిన వేముల మల్లేశ్వరరావు, శ్రీదేవి దంపతులు శనివారం రూ. 1,01,116 దేవస్థాన ఏసీ తిమ్మనాయుడుకు అందజేశారు. ఆయన వారిని అభినందించారు.